క్లుప్తంగా

జంపెనలో ఉపాధి హామీ గ్రామసభ



మాట్లాడుతున్న సర్పంచ్ గురువులునాయుడు

మాడుగుల రూరల్: గ్రామాల్లో అత్యవసరమైన ఉపాధి హామీ పనులు గుర్తించి చేపట్టాలని సర్పంచ్ నేమాల గురువులునాయుడు తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపునకు జంపెనలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి ఏపీవో నవర వరహాలుబాబు మాట్లాడుతూ గ్రామంలో 12 రకాల పనులు గుర్తించామన్నారు. కాలువల్లో పూడికతీత, గట్లు పటిష్టపరచడం, మొక్కల పెంపకం వంటి పనులు చేపట్టడానికి సమావేశంలో తీర్మానించారు. పంచాయతీ కార్యదర్శి గెంజి నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత



నగదు అందజేస్తున్న సర్పంచ్ సలాది ధనలక్ష్మి గంగశేషు

మాడుగుల రూరల్: చీడికాడ మండలం అడవి అగ్రహారంలో మైచర్ల గాలిదేముడు కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా సర్పంచ్ సలాది ధనలక్ష్మి గంగశేషు శుక్రవారం రూ.10 వేలు అందజేశారు. ఇటీవల మైచర్ల గాలిదేముడు ప్రమాదవశాత్తు మృతి చెందడంతో మిగిలిన మొత్తం నామినీ ఖాతాలో జమకానుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గంటా మత్స్యరాజు, సలాది సన్యాసిరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాఠశాలలకు సామగ్రి పంపిణీ



సామగ్రిని అందజేస్తున్న ఎంఈవో మూర్తి

మాకవరపాలెం: పాఠశాలలకు సరఫరా చేసిన సామగ్రిని ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ మేరకు స్థానిక ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం ఎంఈవో మూర్తి ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లోని మరుగుదొడ్లను శుభ్రం చేసే రసాయనాలు, తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాలకు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం వండేందుకు అవసరమైన వంట పాత్రలను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. వీటిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేసినట్టు చెప్పారు.

తెగుళ్ల నివారణలో అప్రమత్తం



కొండలఅగ్రహారంలో వరిపంటను పరిశీలిస్తున్న ఏవో

మాకవరపాలెం: తెగుళ్ల నివారణలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో చిరంజీవి సూచించారు. మండలంలోని కొండలఅగ్రహారం, మాకవరపాలెం, పైడిపాల, తదితర గ్రామాల్లో తెగుళ్ల సోకిన వరి పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అధికంగా ఆకుముడత, దోమపోటు తెగుళ్లు ఉన్నాయన్నారు. వీటి నివారణకు ఎసిఫేట్, బుప్రోఫెజిన్ లేదా కార్టాఫ్ హైడ్రో క్లోరైడ్ మందును పిచికారీ చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితి నేపథ్యంలో ఎండిపోతున్న వరి పొలాలకు 13-0-45(పొటాషియం నైట్రేట్) ఎరువును 10 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే పది రోజుల వరకు పంటను కాపాడుకోవచ్చన్నారు.

• రోగులకు అండగా జగనన్న ఆరోగ్య సురక్ష



రోలుగుంట మండలం నిడుగొండలో మందులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



నర్సీపట్నం మున్సిపాలిటీ 28 వార్డు రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. అన్ని గ్రామాల్లోనూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలందిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందుల పంపిణీ చేస్తున్నారు. సీరియస్ కేసులను పట్టణాలకు పంపించి కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం చోడవరం సచివాలయం–2తోపాటు రోలుగుంట మండలం నిండుగొండ, రావికమతం మండలం గొంపలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మందులు పరిశీలించారు. నర్సీపట్నం మున్సిపాలిటీ 28 వార్డు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ప్రారంభించారు. సురక్ష క్యాంపు సేవలపై రోగులతో మాట్లాడారు. కె.కోటపాడు మండలం కొరువాడ జగన్నాథపురం, దేవరాపల్లి, మాడుగుల మండలం జి. అగ్రహారంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



దేవరాపల్లిలో పోషకాహార స్టాళ్లను పరిశీలిస్తున్న ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం



నర్సీపట్నం మున్సిపాలిటీ 28 వార్డు రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



కె.కోటపాడు మండలం కొరువాడ జగన్నాథపురంలో పరీక్షిస్తున్న వైద్యాధికారి శైలజ

సచివాలయాలతో ప్రజల వద్దకే పాలన

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: ప్రజల వద్దకే పాలన అందించాలన్న ఆలోచనతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని, ఓర్పు, నేర్పు, అన్ని వర్గాల వారికి మేలు చేసే పాలన ఆయనకే సాధ్యమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. నిండుగొండలో రూ.40 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ శెట్టి సంధ్యతో కలసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం సచివాలయాల ఏర్పాటు, మేలు గురించి మాట్లాడారు.

దీనిలో భాగంగా ప్రజలతో ఆప్యాయతగా మాట్లాడి శాఖాపరమైన సేవలందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువచ్చి మన్ననలను పొందాలని ఇక్కడ సిబ్బందికి సూచించారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ టి.వి. రమణ, పార్టీ సీనియర్ నాయకులు శెట్టి సత్యనారాయణ మూర్తి, పోతల లక్ష్మీశ్రీనివాస్, ఉలబాల రాము పాల్గొన్నారు.



నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ కరణం ధర్మశ్రీ, సర్పంచ్ సంధ్య

న్యాయం చేయాలని వివాహిత వినతి

నర్సీపట్నం: గొలుగొండ మండలం యర్రవరం గ్రామానికి చెందిన పట్నాల నాగకన్యాకుమారి తనకు న్యాయం చేయాలని స్థానిక ఆర్డీవో కార్యాలయం ఏవో సూర్యనారాయణకు మొరపెట్టుకుంది. ఆమె భర్త లవకుశ 2021లో విద్యుదాఘాతంతో మరణించాడు. ఆ సమయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మృతుడి కుటుంబానికి రూ.2 లక్షల సాయం చేయడంతోపాటు ఇటీవల సీఎం సహాయనిధి నుంచి మరో రూ.2 లక్షలు మంజూరు చేయించారు. ఉపాధి కల్పిస్తామని నాయకులు ఇచ్చిన హామీ నెరవేరలేదని ఆమె వాపోయింది. ఇద్దరు చిన్నారులతో బతకటం కష్టంగా ఉందని, తన కుటుంబ పరిస్థితి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని ఏవోకు విన్నవించుకుంది.

15 వేల ఎకరాల్లో ఈ- క్రాప్ సామాజిక తనిఖీ



ఈ - క్రాప్ నమోదు వివరాల జాబితా ప్రదర్శిస్తున్న ఏవో వాసుదేవరావు



పి.పి.అగ్రహారం రైతు భరోసా కేంద్రంలో ఈ - క్రాప్ జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

మాడుగుల: మండలంలో ఖరీఫ్ పంటలకు సంబంధించి 15 వేల ఎకరాల్లో ఈ -క్రాప్ నమోదు చేశామని వ్యవసాయాధికారి వాసుదేవరావు తెలిపారు. శుక్రవారం కింతలి వల్లాపురం రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ- క్రాప్ సామాజిక తనిఖీలో ఆయన మాట్లాడారు. రైతులు తమ పొలాల్లో వేసిన పంటకు బదులు వేరొక పంట పొరపాటున నమోదైతే ఈ తనిఖీల్లో బయటపడుతుందన్నారు. రైతుల ఎదుట ఈ- క్రాప్ నమోదు వివరాల జాబితా చదివి వినిపిస్తామన్నారు. ఈ - క్రాప్ పంటల వివరాల జాబితాలు మండలంలో 23 ఆర్బీకేల్లో ప్రదర్శించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి, ఉప సర్పంచ్ మట్టా గోవింద్, వైఎస్సార్ సీపీ నాయకుడు తాళ్లపురెడ్డి రాంబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సోమన్నదొర, ఆర్బీకే సిబ్బంది, కల్యాణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

29 లోగా తెలియజేయాలి

మాకవరపాలెం: ఈ -క్రాప్ నమోదు జాబితాలో అభ్యంతరాలను ఈ నెల 29వ తేదీలోగా తెలియజేయాలని ఏవో చిరంజీవి రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఈ - క్రాప్ నమోదు పూర్తి చేశామన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ఆర్బీకేల్లో వీటి జాబితాలను అందుబాటులో ఉంచామన్నారు. రైతులు వీటిని పరిశీలించి అభ్యంతరాలు ఉంటే వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలన్నారు.

సందడిగా జగనన్న కాలనీలో గృహ ప్రవేశాలు



గృహప్రవేశం చేసిన బాబూరావు, లక్ష్మి దంపతులు, కుటుంబీకులు

రావికమతం: కొత్తకోట జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న విసారపు బాబూరావు, లక్ష్మి, వి.జి.మురళి, అరుణ దంపతులు శుక్రవారం గృహ ప్రవేశం చేశారు. ప్రభుత్వం వీరికి జగనన్న కాలనీలో స్థలం కేటాయించడంతో చూడచక్కగా ఇళ్లు నిర్మించుకున్నారు. కాలనీలో విద్యుత్, నీటి సదుపాయం కల్పించడంతో వేగంగా ఇంటి నిర్మాణానికి వీలయిందన్నారు. సొంతింటికి ఎట్టకేలకు జగనన్న సహాయంతో చేరుకున్నామని వారు ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, తదితర నాయకులు అక్కడికి చేరుకోవడంతో సందడి చోటుచేసుకుంది. అంతా సహపంక్తి భోజనాలు చేశారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష ప్రారంభం

రావికమతం: కొత్తకోట అయ్యప్ప స్వామి ఆలయం వద్ద మాలధారణ భక్తులకు ఉదయం టిఫిన్(వడి), మధ్యాహ్నం భోజనం(భిక్ష) కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. దీనికిగాను గ్రామానికి చెందిన ఉల్లూరి రాజు, వెల్లంకి ఈశ్వరరావు, కూరాకుల బాబ్జి, గుమ్ముడు కన్నయ్యదొర, చేపూరి శ్రీను, కోన నానాజి, ఎల్లేటి అప్పారావు, పచ్చిగోళ్ల సంతోష్‌కుమార్ దంపతులు, దుప్పట్ల రమేష్, అడ్డూరి గణేష్ బ్రదర్స్, గెడ్డం సూరిబాబు, చిత్రాడ రాజు సహకారం అందిస్తున్నారు. డిసెంబరు 7వ తేదీ వరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వారు చెప్పారు. పలువురు అయ్యప్పమాలధారణ స్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొని సహాయ సహకారాలందించారు.



టిఫిన్ ఏర్పాట్లు చేస్తున్న దాతలు

స్థలాలు ఆక్రమించి భవనాలు నిర్మిస్తే చర్యలు



స్థలం ఆక్రమించి నిర్మించిన గోడను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు

నాతవరం: ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాల్లో నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించి సమస్యలు సృష్టించొద్దని తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్ నాయుడు తెలిపారు. ఎం.బెన్నవరం ఎస్సీ కాలనీలో ప్రభుత్వం ఇచ్చిన స్థలం కంటే అదనంగా రోడ్డును ఆక్రమించి ఇంటి గోడ నిర్మిస్తున్నాడని సరిహద్దుదారుడు ఇటీవల జగనన్నకు చెబుదాంలో కలెక్టరుకు ఫిర్యాదు చేశాడు. దీనిపై శుక్రవారం తహసీల్దారు పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాలనీలో రోడ్డుకు ఆటంకాలు లేకుండా ఇల్లు నిర్మాణాలు చేయాలన్నారు. స్వచ్ఛందంగా ఆక్రమణ స్థలం విడిచిపెట్టాలని, లేదంటే తామే సర్వే చేసి ఆక్రమణ స్థలాన్ని ఖాళీ చేస్తామని హెచ్చరించారు. దీనిపై చర్యలకు వీఆర్వో బాబును, పంచాయతీ కార్యదర్శి శ్రీనును ఆదేశించారు.

శీతాకాలంలో పశు సంరక్షణపై అవగాహన



పశువులకు చికిత్స అందిస్తున్న ఏడీ చిట్టినాయుడు

మాడుగుల: శీతాకాలంలో పశు సంరక్షణపై అవగాహన పెంచుకోవాలని స్థానిక పశు వైద్యశాల సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు తెలిపారు. అవురువాడ పంచాయతీ తిరువాడలో శుక్రవారం పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో దూడపెయ్యిల మరణాలు తగ్గాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం 75 శాతం రాయితీపై కాకిజొన్న, అలసంద గడ్డి విత్తనాలు అందిస్తుందన్నారు. రూ.500కే లింగ నిర్ధారిత వీర్యం, వైఎస్సార్ సంచార ఆరోగ్య సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం శిబిరంలో 18 పశువులకు గర్భకోశ వ్యాధులకు, 20 పశువులకు చూడి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కింతలి వల్లాపురం పశు వైద్యాధికారి నరేష్, పశువైద్య సిబ్బంది శైలేంద్ర, కుమారి, కిశోర్, మట్టా శివ, గజాల శ్రీను, పాడి రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహారదీక్షలు

నర్సీపట్నం: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఉద్యోగులు శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను జిల్లా జోనల్ కార్యదర్శి సుధాకర్, డిపో కార్యదర్శి జి.ఎస్.నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. తొలగించిన ఉద్యోగుల అపీళ్లను స్వీకరించాలన్నారు.



రిలే దీక్షలు చేస్తున్న అసోసియేషన్ ఉద్యోగులు

వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతా..

విప్ ధర్మశ్రీని కలిసిన విశాఖ డెయిరీ పాలకేంద్రం ప్రెసిడెంటు సత్యం



లగుడు సత్యంను పూలదండతో సత్కరిస్తున్న విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: తాను వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతానని విశాఖ డెయిరీ నిండుగొండ పాలకేంద్రం ప్రెసిడెంటు లగుడు సత్యం అన్నారు. గ్రామానికి విచ్చేసిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని శుక్రవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. తాను జనసేన పార్టీలో చేరినట్టు కొన్ని దినపత్రిక(సాక్షి కాదు)ల్లో రావడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఇదంతా అవాస్తమన్నారు. ఈ సందర్భంగా సత్యం నిబద్ధతను అభినందిస్తూ పూలదండతో సత్కరించారు. సర్పంచ్ సంధ్య, మాజీ ఎంపీపీ సత్యనారాయణమూర్తిలతో కలిసి పార్టీ కోసం పని చేయాలని సూచించారు.

15లోగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం

• చీడికాడ మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ జయమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ కురచా జయమ్మ

మాడుగుల రూరల్: మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు వచ్చే నెల 15వ తేదీకి పూర్తవుతాయని చీడికాడ ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. ఆమె అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం చీడికాడ మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కె. జయప్రకాష్‌రావు శాఖల వారీగా సమీక్షించారు. మండల ఇంజినీర్ పరిదేశి నాయుడు మాట్లాడుతూ చీడికాడ మండలంలో గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలతోపాటు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు 30 భవనాలు పూర్తి కాగా, మరో 30 వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఉపాధి పనులకు సంబంధించి సమీక్షలో ఏపీవో నాగరాజు మాట్లాడుతూ మండలంలో రూ.15 కోట్లతో డిసెంబర్ నుంచి ఉపాధి పనులు ప్రారంభిస్తామన్నారు. గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా పైపులైన్లు ఏర్పాటు చేయడం వల్ల రహదారులు పూర్తిగా ధ్వంసమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీకాంత్ దృష్టికి పలువురు ప్రజా ప్రతినిధులు తీసుకొచ్చారు. అప్పలరాజుపురం నుంచి వి.ఆర్.ఆర్.పేట, చీడికాడ నుంచి చోడవరం ఆర్‌అండ్‌బీ రహదారి పనులకు ప్రతిపాదనలు పంపించామని జేఈ శ్రీనివాస్ తెలిపారు. వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి, తహసీల్దారు బి.వి.రాణి, మండల హౌసింగ్ అధికారి సూరిబాబు, ఎంఈవోలు బి.వి.రమణ, బోంజిబాబు, ఏవో కృష్ణవేణి, ఐసీడీఎస్ పీవో సి.హెచ్. శ్రీదేవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

• జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి



మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి

కె.కోటపాడు: మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి నిధులు రూ.15.50 కోట్లతో అభివృద్ధి పనులు జరిగినట్లు జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి తెలిపారు. ఈ పనులపై ఈ నెల 28 నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీలు చేయాలన్నారు. ఈ విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆమె అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఉపాధి వేతనదారులకు రూ.8 కోట్లు, పీఆర్ ద్వారా మెటీరియల్ నిధుల కింద రూ.5.50 కోట్లతో పనులు చేసినట్లు తెలిపారు. వీటికి సంబంధించి ఎస్‌ఆర్పీల ఆధ్వర్యంలో డీఆర్పీ, వీఎస్‌ఏలు ఉపాధి సామాజిక తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 10న మండల స్థాయిలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తామని ఏపీవో అప్పలరాజు తెలిపారు. మండల ఇంజినీర్ బాలాజీ అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ అల్లు శ్వేత, పశుసంవర్ధక శాఖ ఏడీ బైరాగి, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

ఆ పిల్లలందరినీ బడిలో చేర్పించండి

ఎంఈవో తాడి అమృత్‌కుమార్



అవగాహన కల్పిస్తున్న ఎంఈవో అమృత్‌కుమార్

నాతవరం: బడి మానేసిన పిల్లల వివరాలను వచ్చే నెల 10వ తేదీలోపు యాప్‌లో నమోదు చేయాలని ఎంఈవో తాడి అమృత్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం సచివాలయ సిబ్బంది, సీఆర్పీలతో సమావేశమై మాట్లాడారు. ఐదు నుంచి 18 ఏళ్లలోపు వయసు పిల్లలను మరలా బడిలో చేరేలా అవగాహన కల్పించాలన్నారు. సీఆర్పీలు పోలుపర్తి నాగేశ్వరరావు, వెంకటలక్ష్మి, సత్యవేణి, గోవిందరావు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: బడిఈడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించాలని చీడికాడ ఎంపీడీవో కె. జయప్రకాష్‌రావు అన్నారు. చీడికాడ ఎమ్మార్సీలో శుక్రవారం ఆయన ఎంఈవోలు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. వచ్చే నెల 10వ తేదీ లోపు పాఠశాలల్లో లేదా ఓపెన్ స్కూలులో చేర్పించాలని, చదువుపై ఆసక్తి లేని వారిని వృత్తి విద్యా శిక్షణ ఇప్పించాలని సూచించారు. ఎంఈవోలు బోంజుబాబు, బి.వి.రమణ, సీఆర్పీలు పాల్గొన్నారు.

కొమరం భీమ్‌కు ఘన నివాళి

నర్సీపట్నం: ఆదివాసీ నాయకుడు కొమరం భీమ్ వర్ధంతిని స్థానిక బీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడి చిత్రపటానికి నియోజకవర్గ ఇన్‌చార్జి బొట్టా నాగరాజు, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి స్వాతంత్య్రం రాక ముందే ఆదివాసీ హక్కుల సాధనకు కొమరం భీమ్ పోరాడారని కొనియాడారు. నర్సీపట్నం నియోజకవర్గంలో మైదాన ప్రాంత గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్లో చేర్చి ఆదివాసీలకు న్యాయం చేయాలన్నారు. నాయకులు కొల్లి గంగాధర్, సంజీవ్, సూరిబాబు, లక్ష్మణ్, శ్రీను పాల్గొన్నారు.

మాడుగులలో అన్నసమారాధన



దేవీ ఆలయం వద్ద అన్నసమారాధనలో భక్తులు

మాడుగుల: స్థానిక దేవీ ఆలయం వద్ద ఏటా మాదిరిగానే దసరా ఉత్సవాలు ముగిసిన సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేస్తుంటారు. శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నంనీడి కుటుంబ సభ్యులు, శ్రీనువాసరావు, జానకీరామయ్య, ఆదినారాయణ, నాగవరప్రసాద్ రావుల ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప, భవానీమాలధారణ భక్తులకు ప్రత్యేకంగా భిక్ష ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడు ఎస్.వి. కొండలరావు, ఉపాధ్యక్షుడు, సతీష్, కార్యదర్శి ఇల్లపు రమణ, ఉప సర్పంచ్ దేవరాపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, మోటార్ సంఘం నాయకులు ఎల్. సుందరరాజు, కోడూరి సూరి, ఆర్టీసీ ఆటో మోటార్ యూనియన్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు

• పీకేగూడెం పీఏసీఎస్ టర్నోవర్ రూ.6.80 కోట్లు
• పర్సన్ ఇన్‌చార్జి అచ్చెర్ల వరహాలబాబు



నాతవరం: రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు సకాలంలో అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని పీకేగూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి అచ్చెర్ల వరహాలబాబు తెలిపారు. శుక్రవారం పీకేగూడెం పీఏసీఎస్‌లో బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన వివరించారు. రైతులకు కావల్సిన అనేక రకాలు రుణాలు తక్షణమే ఇస్తామన్నారు. ప్రస్తుతం పీఏసీఎస్ టర్నోవర్ రూ.6.80 కోట్లు ఉందని, 2,500 మందికి వివిధ రకాల రుణాలు ఇచ్చామన్నారు. మొత్తం 7 వేలకు పైగా సభ్య రైతులు ఉన్నారన్నారు. 20 సెంట్లు విస్తీర్ణం భూమి ఉంటే రైతుకు రూ.లక్ష రుణం ఏడు శాతం వడ్డీతో ఇస్తామని, ఎకరా రైతుకు రూ.4 లక్షల వరకు దీర్ఘకాలిక కింద రుణం ఇస్తామన్నారు. రైతులు భూములు అభివృద్ధి చేసుకునేందుకు ఎకరాకు రూ.1.50 లక్షల వరకు రుణం ఇస్తామన్నారు. వ్యవసాయ పెట్టుబడి కింద క్రాప్ రుణం ఎకరానికి రూ.40 వేలు తక్కువ వడ్డీకే ఇస్తున్నామన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రైతులకు బంగారు ఆభరణాలపై 7 శాతం వడ్డీపై రుణాలు ఇస్తున్నామన్నారు. వాణిజ్య బ్యాంకులు తలపించేలా పీఏసీఎస్ ద్వారా పలు రకాల రుణాలు అందించేందుకు ఉన్నతాధికారులు దృష్టి సారించారన్నారు. ఈ ప్రాంత రైతులకు రుణాలు అధికంగా ఇచ్చేందుకు ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ రాష్ట్ర సహకార మంత్రితో మాట్లాడారన్నారు. దాని కారణంగా ఇక్కడ పీఏసీఎస్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. సీఈవో రామారావు, బోర్డు డైరెక్టర్లు గుడపర్తి అచ్చియ్యనాయుడు, ఉలబాల గంగునాయుడు, సర్పంచ్ లగుడు నాగేశ్వరరావు ఎంపీటీసీ సభ్యులు గాడి దేవిరమేష్, సిబ్బంది పాల్గొన్నారు.